క్లుప్తంగా

పాలకుర్తిలో డెంగీ కేసు నమోదు



బాలిక ఇంట్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

దేవనకొండ: మండలంలోని పాలకుర్తి గ్రామంలో 16ఏళ్ల బాలిక డెంగీ బారిన పడిందని జిల్లా అధికారుల సమాచారం మేరకు స్థానిక సబ్ యూనిట్ ఆఫీసర్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ వీరప్రతాప్ సోమవారం గ్రామంలో పర్యటించారు. దోమల నివారణ మందులను పిచికారి చేయించారు.బాలిక ఇంటి పరిసరాలు చుట్టుపక్కల శుభ్రం చేయించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్స్ రంగస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

హాలహర్వి: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్ర హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం రాత్రి మండలంలోని నిట్రవట్టి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలో ఎవరైనా మట్కా, అక్రమంగా కర్ణాటక మద్యం అమ్మడం, నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సర్పంచుకు సూచించారు. ఏఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బళ్లారి రోడ్డులో వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ బాల నరసింహులు

హొళగుంద: కర్ణాటక సరిహద్దులోని బళ్లారి రోడ్డుతో పాటు ఎల్లార్తి రోడ్డులో రెండు రోజులుగా రాత్రి వేళలో నిర్వహించిన వాహనాల తనిఖీలో ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలనరసింహులు సోమవారం తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే రికార్డులు లేని వాహనదారులతో పాటు నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించినట్లు వెల్లడించారు.

ఏపీఓగా రాజునాయక్



దేవనకొండ: ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా రాజునాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏపీఓ కృష్ణమూర్తి ఆదోనికి బదిలీ అయ్యారు. కొన్ని రోజులపాటు ప్లాంటేషన్ అధికారి రత్నం ఇన్‌చార్జి ఏపీఓగా వ్యవహరించారు. జిల్లాస్థాయి అధికారుల ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలం నుంచి రాజునాయక్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు కల్పించి వలసల నివారణకు తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ఆలూరు: పెన్షనర్లు జీతభత్యాలను పొందాలంటే అందుకు ఈనెల 28వ,తేదీలోపు జీవన్ ప్రమాణ యాప్‌ను స్మార్టు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ కార్డుతో లింకేజీ చేసుకున్న బ్యాంకు నంబర్‌ను జతచేసి తమ కార్యాలయానికి జిరాక్స్ కాపీలను అందజేయాలని ఎస్‌టీఓ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి పదవీ విరమణ పొందిన పెన్షనర్లు ఆలూరు ఉపఖజానా పరిధిలో 680 మంది వరకు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు దాదాపు 400 మంది ఆధారా లను అందజేశారన్నారు.మిగిలిన పెన్షనర్లు ఈనెల 28వ తేదీలోపు ట్రెజరీ కార్యాలయానికి వచ్చి ఐరీస్‌ను నమోదు చేసుకుంటే జిల్లా ఖజానాకు నివేదిక అందజేస్తామని చెప్పారు. నడవలేని మంచానపడిన వారి సమాచారం ఇస్తే తామే స్వయంగా వారి వద్దకు వెళ్లి ఐరిష్ నునమోదు చేసుకుంటామని తెలిపారు.

శివదీక్ష స్వీకరణ



ఆస్పరి: రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో సోమవారం మండలంలోని చిన్నహోతూరు, యాటకల్లు గ్రామాలకు చెందిన 22 మంది అర్థ మండల శివ దీక్షను స్వీకరించారు. గురుస్వామి రూపామోహన్ శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి వారికి శివ మాల వేశారు.



మద్దికెరలోని రైల్వే స్టేషన్



మద్దికెరలోని ప్రభుత్వ వైద్యశాల

శతమానం భవంతి

- చెక్కుచెదరని వందేళ్లనాటి కట్టడాలు
- అబ్బురం ..అద్భుతం

మద్దికెర : ప్రస్తుత నిర్మాణాలు 20 ఏళ్లు గడిచాయంటే గగనమే. ఎందుకంటే వాటి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వకపోవడమే. అయితే బ్రిటీష్ వారి హయాంలో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కుచెదరకపోవడం నాటి నిర్మాణాల్లో వారు పాటించిన నాణ్యతను స్పష్టం చేస్తుంది. 19 శతాబ్దంలో బ్రిటీష్ వారు మద్దికెరలో నిర్మించిన కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా అబ్బురపరుస్తున్నాయి. గార సున్నం, రాతినార, బెల్లం మిశ్రమాలను కట్టడాలకు వినియోగించినట్లు తెలుస్తోంది. రాతితో 18 నుంచి 20 అడుగులకు పైగా ఎత్తులో భవనాలు నిర్మించారు. గాలి, వెలుతురుతో భవనాలు ఆహ్లాదపరుస్తున్నాయి. ప్రాథమిక వైద్యశాల, భవనాలు, రైల్వే స్టేషన్ వందేళ్లు పూర్తి చేసుకున్నాయి. బ్రిటీష్ హయాంలో పెంకులుతో నిర్మించడంతో వేసవి కాలంలో కూడా గదులు చల్లగా ఉంటాయి. అందులో ఇప్పటికీ వైద్యసిబ్బంది సమావేశాలు నిర్వహిస్తుంటారు. నిర్మాణ తేదీలను పేర్కొనకపోయినప్పటికీ రైల్వే స్టేషన్, ఆసుపత్రి నిర్మాణంలో వాడిన పెంకులపై 1853 సంవత్సరాన్ని ఏర్పాటు చేశారు. కాగా రైల్వే లైన్ డబుల్ లైన్ కావడంతో మరో స్టేషన్‌ను ప్రస్తుతం ఉన్న భవనానికి సమీపంలో నూతనంగా నిర్మించారు. అలాగే.. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి వెనుక భాగంలో ఆసుపత్రి కోసం కొత్త భవనాలను నిర్మించారు. అయినప్పటికీ వైద్యులు పాత భవనాల్లో కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు. ఇందుకు కారణం.. వెలుతురు, గాలి విశాలంగా వస్తుండటమేనని వారు చెబుతున్నారు.

నాణ్యతకు నిదర్శనం



నాడు నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి భవనాలు నిర్మించారు. కావలసిన ఎత్తు మేరకు గోడలు నిర్మించి విశాలమైన కిటికీలు పెట్టడం వల్ల గాలి, వెలుతురు బాగా ప్రసరిస్తోంది. ఇప్పటికీ ఈ భవనాలు ఎంతో ఆకర్షణీయంగా, చెక్కు చెదరకుండా ఉండటం విశేషం.

– డాక్టర్ రాగిణి, మద్దికెర

రాతి కట్టడం అద్భుతం



బ్రిటీష్ పాలకులు మద్దికెర రైల్వే స్టేషన్‌ను నిర్మించిన తీరు చూస్తే అబ్బురపరుస్తుంది. ఇసుక, గార, సున్నం తదితర మిశ్రమాలను నూర్పిడి యాంత్రాలతో ఆడించి కట్టడాలు చేపట్టారు. కనీసం గోడలు కూడా దెబ్బతినలేదు. ప్రధానంగా 20 అడుగుల ఎత్తులో గోడలు నిర్మించడం అద్భుతం

– కిష్టన్న, రైల్వే విశ్రాంతి ఉద్యోగి, మద్దికెర

నేడు రథసప్తమి

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం రథసప్తమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ వీరయ్య సోమవారం తెలిపారు. స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు అనంతరం కల్యాణోత్సవం ఉంటుందని చెప్పారు.

తాయమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు

మద్దికెర : మండలంలోని బసినేపల్లి గ్రామ శివార్లలోనున్న తాయమ్మ అవ్వకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ఆంజనేయులు, నాగరాజు, చందు, సోము అన్నదానం చేశారు.

11న రాష్ట్ర స్థాయి గిరక బండి పోటీలు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈనెల 11వ తేదీన రాష్ట్ర స్థాయి గిరక బండి పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా.. రూ. 20,116, రూ.15,116, రూ.10,116, రూ.8,116, రూ.5,116, రూ.3,116,రూ.2,116, ఎనిమిది రూ.1,116 బహుకరించునున్నట్లు చెప్పారు. పాల్గొనే వారు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. వివరాలకు సెల్ :9182537760, 8886198667లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం





విశేష అలంకరణలో భువనగాయత్రీ దేవి,హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: పట్టణ సమీపంలో కర్నూలు వైపు హైవే-44 ప్రక్కన ద్వారకానగర్‌లో కొలువైన భువనగాయత్రీ దేవి ఆలయ 9వ వార్షికోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి బాలకృష్ణాచారి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకములు, సామూహిక గాయత్రీ జపం నిర్వహించారు. అనంతరం ముఖ్య ఘట్టమైన గాయత్రీమాత పంచకుండి యజ్ఞంను ఆలయ ప్రాంగణంలో ఆలయ ట్రస్టు ప్రతినిధులు రఘునాథరెడ్డి, రాము ఆచారి, రమణాచలం, సీవీ రమణ, హరిసింహనాయుడు, రమణాచారి, హరినాథ్ ఆచారి, లక్ష్మీ సరోజ, జగదీశ్‌ల ఆధ్వర్యంలో జరిపించారు. అనంతరం అశ్వర్థ నారాయణ స్వామి (రావి, వేప చెట్లుకు) వారి కల్యాణం వేడుకగా జరిగింది. రావి చెట్టును స్వామి వారిగా, వేప చెట్టును అమ్మవారిగా అలంకరించి పండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ తంతు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన వితరణ, సాయంకాలం సామూహిక దీపయజ్ఞం జరిగింది. పారిశ్రామికవేత్త తిరువీధి సాయిప్రసాద్, పలువురు ప్రముఖులు, తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని, కల్యాణాన్ని తిలకించారు.

- ఘనంగా వసంతి పంచమి



వెల్దుర్తిలో దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు



కోయిలకొండ హైస్కూల్‌లో సరస్వతీ పూజ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సరస్వతీ.. నమస్తుభ్యం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: వసంత పంచమిని పురస్కరించుకుని మండల పరిధిలోని కోయిలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. అర్చకులు సరస్వతిదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హెచ్‌ఎం మైఖేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: వసంత పంచమి వేడుకల్లో భాగంగా సోమవారం పలు పాఠశాలల్లో కొలువైన సరస్వతీ విగ్రహాల వద్ద, పలు పాఠశాలల్లో దేవి చిత్ర పటాలను ఉంచి ఉపాధ్యాయ, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.శారదా విద్యానికేతన్ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమంతోపాటు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సరస్వతీదేవి, వినాయకుడు, లక్ష్మీదేవి వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

మద్దికెర : చదువుతో ఉత్తమ భవిష్యత్ లభిస్తుందని పూర్వ విద్యార్థి హనుమంతురావు అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకొని రూ.15లక్షలతో నిర్మించిన సరస్వతి మండపం తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసాలను చేయించారు. అలాగే విద్యాసాయి డిగ్రీ కళాశాలలో అక్షరాభ్యాసం జరిపించారు.కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్, ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం



పత్తికొండలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ రూరల్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం బీజేపీని నిలదీయాలని సీపీఎం మండల కార్యదర్శి చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఈశ్వరరెడ్డి భవన్ నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు పి.కాశి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించకపోవడాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కార్పొరేట్లకు ఊతమిచ్చేలా బడ్జెట్ ఉందని, సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రను ఆదుకోవడానికి నిధులు కేటాయించకపోవడాన్ని చూస్తే మరోసారి పక్షపాత ధోరణి వెల్లడైందన్నారు. రాజధాని అమరావతి, కడప ఉక్కు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధుల ఊసే లేదన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

దేవనకొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యంగా కర్నూలు జిల్లాకు మొండి చేయి చూపిందని సీపీఎం మండల కమిటీ సభ్యులు అశోక్ అన్నారు. సోమవారం బడ్జెట్‌కు నిరసనగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా రాష్ట్రానికి ఇదే అన్యాయం, తీవ్రమైనద్రోహం చేస్తున్నారని విమర్శించారు.రమేష్, బలరాముడు, బండ్లయ్య, కుమార్, మహేష్, రంగడు, రాముడు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం 10వ తరగతి విద్యార్థినులకు యూటీఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్ విత్ ఆన్సర్స్‌ను ఉచితంగా అందించారు. డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ వీఆర్ యాదవ్ అందించిన మెటీరియల్‌ను ఉపాధ్యాయిని ఉషారాణి, ఎస్‌ఓ షాకీరా బేగం విద్యార్థినులకు అందించారు.

ఆరోగ్య సూచనలు పాటించాలి



ఆరోగ్య సేవల పరిశీలనలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

వెల్దుర్తి: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూచనలు పాటించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-1లో అందిస్తున్న 104 (సంచార చికిత్స) సేవలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రామళ్లకోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రతిభ, 104 సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య సేవలకు వచ్చిన పలువురు గర్భిణులు, మధుమేహ, రక్త పోటు వ్యాధి గ్రస్తులకు ఆరోగ్య సూచనలందించారు. వ్యాయామం, మంచి అలవాట్లతో అనారోగ్యాన్ని దూరం చేసుకోవచ్చన్నారు.

దుమ్ము సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్



హొళగుంద తేరు బజారులో ట్యాంకర్‌తో నీటిని వెదజల్లుతున్న దృశ్యం

హొళగుంద: దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న హొళగుంద ప్రజలకు ఉపశమనం కోసం పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. తేరుబజారుతో పాటు బస్టాండు నుంచి ఈర్లకట్ట, వాల్మీకి సర్కిల్ వరకు రోడ్లపై వాహనాల రాకపోకలకు దుమ్ము, దూళి లేస్తూ ప్రజలు, వ్యాపారులు పడున్న ఇబ్బందులపై సోమవారం సాక్షి దిన పత్రికలో 'తినలేం.. ఊపిరి పీల్చలేం!' అనే కథనాన్ని ప్రచురించింది. స్పందించిన సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ప్రత్యేకంగా ట్యాంకర్ ఏర్పాటు చేసి దుమ్ము రేగకుండా నీటిని చల్లించారు. జాతర పూర్తయ్యే వరకు నీటిని చల్లిస్తామని తెలిపారు. ఆ తరువాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హొళగుందలో పారిశుద్ధ్య పనులు



తేరుబజారులో చెత్త తొలగిస్తున్న దృశ్యం

హొళగుంద: ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్ధేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటిరి రాజశేఖర్ తెలిపారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతితో కలిసి ఆలయ పరిసరాలు, తేరుబజారు, ఇతర కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే.. చేతిపంపుల మరమ్మతు, మోటార్ల బిగింపు, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు.

మహిళా డాక్టర్ల దినోత్సవం

దేవనకొండ: మండల కేంద్రంలో జాతీయ మహిళా డాక్టర్ల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది డాక్టర్ అరుణజ్యోతిని సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రంగస్వామి, హనుమంతమ్మ, శ్రీధర్, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, ఏఎన్‌ఎం మాధమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ అరుణజ్యోతిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ ఉత్తమ రైతుకు సన్మానం



కోయిలకొండలో చంద్రశేఖర్‌గౌడ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: జాతీయ ఉత్తమ రైతుగా అవార్డు పొందిన మండలంలోని కోయిలకొండ గ్రామానికి చెందిన హాళేబీడు చంద్రశేఖర్‌గౌడ్ దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు, నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌గౌడ్ 15ఏళ్లుగా డ్రిప్ ఇరిగేషన్ కింద ఎక్కువ పొలంలో పండ్ల తోటలు సాగు చేయడంతోపాటు మంచి దిగుబడులు సాధించారన్నారు. గుర్తించిన అధికారులు గత నెల 26న ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం రోజున అవార్డు అందజేసి సన్మానించారు. వ్యవసాయంలో కష్టనష్టాలను, ఒడిదుడుకులను ఎదుర్కొని విజయం సాధించి జాతీయ అవార్డు పొందడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ సర్పంచ్ లక్ష్మిఈశ్వరయ్య, హెచ్‌ఎం మైఖేల్, నాయకులు నబిసాహెబ్, శ్రీరాములు, గురుస్వామి, రఫీ, చిట్యాల సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

వృథా అరికట్టకపోతే.. తప్పదు వ్యథ!



మాదాపురంలో ప్రాథమిక పాఠశాల వద్దనున్న మినీ ట్యాంక్ నుంచి వృథాగా పారిపోతున్న నీరు

రానున్న వేసవిలో మంచినీటికి గడ్డు కాలమే. ఇప్పటికే పలు గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొన్ని గ్రామాల్లో నీరు వృథా అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సి ఉన్నప్పటికీ లీకేజీలు, వృథాను అరికట్టడంలో చర్యలు లోపించాయి. మండలంలోని మాదాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్ నుంచి నీరు వృథాగా పారిపోతుంది. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

–కృష్ణగిరి



హోసూరులో కలశస్థాపనకు ఊరేగింపుగా వస్తున్న దృశ్యం



రథానికి పూజలు చేస్తున్న పండితులు

హోసూరులో తిరునాల సందడి

- ప్రారంభమైన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

పత్తికొండ రూరల్: మండలంలోని హోసూరు గ్రామంలో భక్తుల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు కలశస్థాపన పూజలు చేసి వేడుకలకు అంకురార్పణ గావించారు. భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా పేరొందిన వీరభద్రస్వామి రథోత్సవానికి చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తారు. ఈమేరకు నిర్వాహకులు ఉత్సవమూర్తులను ఊరేగించే రథాన్ని సిద్ధం చేశారు.

7న రథోత్సవం : 6న రాత్రి ఎదుర్కోలు, గణారాధన,ఆయకట్టుదారులకు అన్నదానం,7న శుక్రవారు ఉదయం 9గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం,సాయంత్రం 5గంటలకు రథోత్సవం,8న ప్రభోత్సవం, 9న వసంతోత్సవం ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. వారం పాటు జరిగే ఉత్సవాలతో ఊరంతా పండుగ వాతావరణం సందడి నెలకొంది.



కొలువైన వీరభద్రస్వామి మూలవిరాట్